క్లుప్తంగా

లవకుమార్‌కు సత్కారం



వేమూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన కోగంటి లవకుమార్‌ను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. నూతనంగా జిల్లా పార్టీ పదవి పొందిన లవకుమార్‌కు సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని లవకుమార్ వాగ్దానం చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సహకారంతో పార్టీ పదవి దక్కిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దున్నా మేరీసుబాబు, కూచిపూడి మోషే, దున్నా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్‌కు రిఫ్రిజిరేటర్ అందజేత

రేపల్లె రూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్లడ్ బ్యాంక్‌కు రేపల్లె పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దండుప్రోలు పిచ్చియ్య తన తండ్రి పెదసుబ్బారావు జ్ఞాపకార్థం రిఫ్రిజిరేటర్, ఏసీ పరికరాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు దాతలు సహకరించాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన పరికరాలను అందించిన పిచ్చియ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

చుండూరు(వేమూరు): నూతన సంవత్సరం సందర్భంగా యూటీఎఫ్ నాయకులు క్యాలెండర్ విడుదల చేయడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి చలపతిరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ యూనియన్ నాయకులు ప్రతి ఏడాది డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. యూనియన్ నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 సలోమన్, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో గురువారం స్వయం ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి విడతగా 10 మందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు ఎ.సాంబశివరావు, వి.బాబూజీలు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు బొద్దు నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలాజీ

భట్టిప్రోలు: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ ఆరోపించారు. సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను భట్టిప్రోలులోని ఏబీటీ యూసీ కార్యాలయం ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. బాలాజీ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా చేనేత కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పాలకులు మారుతున్నా నేతన్నల తలరాతలు మారడం లేదని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు రామకోటేశ్వరరావు, జి.లక్ష్మి, వీరమోహన్‌రావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల మనోవికాసాభివృద్ధికి కృషి చేయాలి



నిజాంపట్నం: విద్యార్థుల మనోవికాసాభివృద్ధి జరిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈవో ఆర్.శోభచంద్ తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వివిధ ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన వాతావరణంలో క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకునే విధంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయుడు మార్గదర్శిగా, సహాయకారిగా ఉండాలని, విద్యార్థుల నడవడికను సైతం గమనిస్తూ సక్రమ మార్గంలో పయనించే విధంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల నిర్వహించాల్సిన బాధ్యతలు, పాఠశాల అభివృద్ధి, బాలల పరిరక్షణ తదితర అంశాలపై ఆర్‌పీలు డి.హరిబాబు, వినయ్‌కుమార్, రాజ్యలక్ష్మి, మార్క్, హుస్సేన్‌లు వివరించారు. సమావేశంలో ఎంఈవో శేషుగోపాలరావు, హెచ్ఎంలు, వివిధ ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తోటల్లోనే అరటి కొనుగోళ్లు

- రైతుల వ్యయ ప్రయాసలకు చెక్
- రిలయన్స్ మార్ట్ వెపు రైతుల మొగ్గు
- ప్రస్తుతం మార్కెట్‌లో దిగజారిన అరటి ధరలు



టాటా ఏస్‌లోకి అరటి హస్తాల ట్రేలను ఎక్కిస్తున్న కూలీలు



తోటలోనే రిలయన్స్ మార్ట్ నిర్వాహకులు ప్యాకింగ్‌కు సిద్ధం చేసిన కర్పూర అరటి గెలలు

భట్టిప్రోలు: ప్రస్తుతం మార్కెట్‌లో అరటి గెలల ధరలు పడిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా రిలయన్స్ మార్ట్ (ప్రతినిధులు) వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులు గెలలు నరికేందుకు కూలీలను సమకూర్చుకుని తమ సొంత రవాణా ఖర్చులు పెట్టుకుని మార్కెట్‌కు తరలించుకోవాల్సిన పరిస్థితి లేకుండా రిలయన్స్ ప్రతినిధులు అరటి తోటల వద్దకే వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం అరటి గెల మార్కెట్‌లో పాట ద్వారా రూ.50 నుంచి రూ.150 పలుకుతుంది. రిలయన్స్ ప్రతినిధులు సైజును బట్టి గెల రూ.115కు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు రిలయన్స్‌కు విక్రయించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

రిలయన్స్ ప్రతినిధులకు విక్రయాలు

భట్టిప్రోలు మండలంలోని కృష్ణానదీ పరివాహక లంక గ్రామాల్లో వాణిజ్య పంటగా అరటి తోటలను సాగు చేస్తుంటారు. ఎక్కువగా కర్పూర, చక్కెరకేళి రకాలు సాగు చేస్తుంటారు. మార్కెట్‌కు సరుకు చేర్చాలంటే రైతులు రవాణా ఖర్చులు ఎక్కువ అవుతాయని భావించి రిలయన్స్ ప్రతినిధులకు తోటల్లోనే అమ్ముకుంటున్నారు. మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, పెదపులివర్రు, ఓలేరు తదితర గ్రామాల్లో 1,500 ఎకరాల్లో అరటి సాగవుతుంది. అలాగే కొల్లూరు మండలం చిలుమూరు, ఈపూరు, కిష్కింధపాలెం, పెసర్లంక, పెదలంక తదితర ప్రాంతాలలో పండించిన అరటి గెలలను భట్టిప్రోలు మార్కెట్‌కు తీసుకొచ్చి వేలం ద్వారా అమ్ముకుంటారు. ఈ అరటి గెలలు ఒంగోలు, చీమకుర్తి, కందుకూరు, కొండెపి, సింగరాయకొండ, మాచర్ల, హైదరాబాద్, మిర్యాలగూడెం, అలాగే దగ్గరలోని రేపల్లె, పొన్నూరు ప్రాంతాలకు కూడా రవాణా అవుతున్నాయి.

తోటల వద్దే గ్రేడింగ్

కొనుగోలు చేసిన అరటి గెలలను తోట వద్దే హస్తాలుగా కోసి గ్రేడ్ చేసి అవి దెబ్బతినకుండా ఉండేందుకు ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా కాగితాలు పేర్చి వాహనాల ద్వారా సరుకును హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఒక్కో ట్రేలో 12 నుంచి 14 అరటి హస్తాలు పడతాయి. కూలీలు అరటి గెలలను హస్తాలుగా కోసి వాటిని గ్రేడింగ్ చేసి అందులో జంటలు, మచ్చలు ఉన్నవి, పనికి రానివి పక్కన పెట్టి బాగున్న హస్తాలను ట్రేలో పెడతారు. ఇందుకోసం వ్యవసాయ కూలీలకు రూ.500, టిఫిన్, భోజన సదుపాయాలు రిలయన్స్ ప్రతినిధులు సమకూరుస్తున్నారు.



ప్యాకింగ్ చేసిన అరటి హస్తాల ట్రే

దిగజారిన అరటి ధరలు

ఆషాఢ మాసం నుంచి కార్తీక మాసం వరకు 15 హస్తాలు ఉన్న అరటి గెల భట్టిప్రోలు మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.1,000 పలికింది. ప్రస్తుతం అరటి ధరలు ఒక్కసారిగా దిగజారాయి. భట్టిప్రోలు మార్కెట్‌లో అరటి గెలలకు డిమాండ్ లేకపోవడంతో పక్కన పడవేస్తున్నారు. గెలలను ఊరకే తీసుకెళ్లమని పాటదారులు చెబుతున్నప్పటికీ మోత కూలీ దండగ అని ఎవరూ ముందుకు రావడం లేదు.



భట్టిప్రోలు మార్కెట్‌లో ధర లేక పక్కన పడవేసిన అరటి గెలలు

రెగ్యులర్‌గా లోడ్ హైదరాబాదు పంపించాల్సిందే



గత రెండేళ్లుగా రిలయన్స్ మార్ట్‌కు సరుకును పంపిస్తున్నాను. రెగ్యులర్‌గా లోడ్ హైదరాబాదు పంపించాల్సిందే. ధర ఉన్నా లేకపోయినా లోడు పంపాలి. లేని ఎడల పాత బిల్లులు ఆగిపోతాయి. ప్రస్తుతం తోట వద్ద ఉన్న గెలలను చూసుకుని బాగుంటే అడ్వాన్స్ ఇచ్చి రైతుల వద్ద నుంచి కొనుగోళ్లు చేస్తున్నాం. గతంలో అరటి దిగుబడులను మార్కెట్‌కు తరలించే వాళ్లం.

–కత్తుల చంద్రపాల్, రిలయన్స్ మార్ట్ ప్రతినిధి

కూలీలు, వ్యయ ప్రయాసల భారం తప్పింది



ఇప్పటి వరకు రెండు లోడులు రిలయన్స్ మార్టుకు పంపాను. మొదటి విడత 182 గెలలు, రెండవ విడత 218 గెలలు విక్రయించాను. కూలీలు, వ్యయ ప్రయాసల భారం లేకుండా వారే వచ్చి గెలలను కోసి వారికి కావాల్సిన విధంగా తీసుకువెళ్లారు. అడ్వాన్స్‌గా రూ.50 వేలు అకౌంట్‌లో వేశారు. మిగిలిన మొత్తం రావాల్సి ఉంది.

–నంబూరు మురళీ కృష్ణ, రైతు, వెల్లటూరు, భట్టిప్రోలు

ధరలు చూసి దిగాలు



ప్రస్తుతం ధరలను చూసి దిగులు చెందాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో గెలలకు డిమాండ్ లేకపోవడంతో ఆర్డర్లు తెచ్చుకుని ప్రత్యేక వాహనాల ద్వారా సుదూర ప్రాంతాలకు సరుకు రవాణా చేస్తున్నాం. అక్కడ రూ.300 నుంచి రూ.500 పలుకుతుంది. మిగిలిన సరుకును భట్టిప్రోలు, రేపల్లె, పొన్నూరు మార్కెట్‌లకు తరలిస్తున్నాం.

–కత్తుల రామకృష్ణ, రైతు, పెదపులివర్రు, భట్టిప్రోలు

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గ్రామ స్థాయి అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా గ్రామ సచివాలయానికి వచ్చి అధికారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాడా శ్రీనివాసరావు, మనిపల్లె చిన్న తాండ్ర పద్మావతి, బేసాబత్తుని నాగాంజనేయులు తదితరులు ఉన్నారు.

మద్యం బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్ట్

వేమూరు: మద్యం బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద 8 బాటిల్స్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. కొల్లూరు మండలంలోని పెదలంక గ్రామంలో గురువారం మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సిరాజ్

చందోలు(కర్లపాలెం): ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలోని నదిముల్లాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు నదిముల్లాయపాలెం గ్రామానికి చెందిన మహ్మద్ సిరాజ్ (31) డిసెంబర్ 30వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడని బంధువుల ఇళ్లకు కూడా వెళ్లలేదని తెలిపారు. సిరాజ్ భార్య ఫర్హానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిరాజ్ ఆచూకీ తెలిసిన వారు చందోలు పోలీస్ స్టేషన్ మొబైల్ నంబర్ 9440900871కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు

చుండూరు(వేమూరు): రెవెన్యూ సదస్సులు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. చుండూరు మండలంలోని పెదగాదెవర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. రైతులు 4 అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించి, పరిష్కరిస్తామని తహసీల్దారు నాగరాజు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో రెవెన్యూ సదస్సులకు ప్రజలు హాజరు కావడం లేదని ఆయన అన్నారు. రెవెన్యూ సదస్సులకు అన్ని శాఖల సిబ్బంది హాజరు కాకపోవడం, ప్రజలు రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా ఉంటున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు సమస్యల కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పూడి, గుడ్డికాయలంక గ్రామాలలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. సదస్సుల్లో భూ సమస్యలపై అందిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారించి 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురికి 1బీ కాపీలను అందజేశారు. ఉప్పూడిలో 11, గుడ్డికాయలంకలో 16 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



1బీ కాపీని అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



పెదగాదెలవర్రు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాగరాజు

పల్లెకోన, రాచూరులలో...

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన, రాచూరు పంచాయతీ కార్యాలయాల ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భూమి క్రయ, విక్రయాలు, పేరు మార్పునకు, భూ రిజిస్ట్రేషన్ల సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాచూరు సర్పంచ్ జయవరపు రాధాకృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు పంచాయతీ కార్యదర్శి వక్కలగడ్డ సురేష్, దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ దీవి వేంకటప్లాచార్యులు, ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రాపలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

నేడు బలిజేపల్లిలో రెవెన్యూ సదస్సు

బలిజేపల్లి(వేమూరు): బలిజేపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు తమ సమస్యలు రెవెన్యూ సదస్సు తీసుకొని వస్తే వాటిని పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

రెవెన్యు సదస్సులతో సమస్యలు పరిష్కారం

కొల్లూరు : రెవెన్యు సదస్సులతో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు సత్వరం పరిష్కరించడానికి వెసులుబాటు ఏర్పడిందని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని రావికంపాడు, క్రాప గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్న ఆయన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలుసుకోవడంతో పాటు అర్జీలను స్వీకరించారు. రావికంపాడులో 5, క్రాపలో 3 అర్జీలు బాధితులు అందజేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ నీలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేరలి సర్పంచ్‌గా నేడు వీరయ్య ప్రమాణ స్వీకారం

బాపట్ల: పేరలి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా శుక్రవారం ఉదయం గొర్రుముచ్చు వీరయ్య ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గతంలో పేరలి గ్రామ పంచాయతీకి జరిగిన ఎన్నికలలో పేరలి గ్రామానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లు, గొర్రుముచ్చు వీరయ్య సర్పంచ్ పదవికి పోటీ చేయగా మల్లెల వెంకటేశ్వర్లు గెలుపొంది పదవీ బాధ్యతలు చేపట్టారు. అయితే మల్లెల వెంకటేశ్వర్లుకు సంబంధించి ఓటరు లిస్టులో ఒక పేరు.. ఓటరు ఐడీ కార్డులో మరొక పేరు ఉండటంతో వెంకటేశ్వర్లు సర్పంచ్ పదవికి అర్హుడు కాదని గొర్రుముచ్చు వీరయ్య గతంలో జిల్లా కోర్టును ఆశ్రయించటంతో ఇప్పుడు ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు ఆధారంగా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వెంకటేశ్వర్లును అనర్హుడిగా ప్రకటించటంతో గొర్రుముచ్చు వీరయ్యకు సర్పంచ్ బాధ్యతలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయటంతో శుక్రవారం గొర్రుముచ్చు వీరయ్య సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారని ఎంపీడీవో తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలి

రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయటం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ పిలుపునిచ్చారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేలా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడతామన్నారు. గ్రామ, మండల స్థాయి కమిటీలు ఐక్యంగా ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

ఎస్ఎంసీ విధులు, బాధ్యతలపై శిక్షణ



పల్లెకోన(భట్టిప్రోలు): మండల స్థాయి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) విధులు, బాధ్యతలపై భట్టిప్రోలు మండలం పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్ఎంసీ సభ్యులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో నీలం దేవరాజు మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులు పాఠశాలల అభ్యున్నతికి తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఎస్ఎంసీ విధులు, బాధ్యతలపై రిసోర్స్ పర్సన్స్ వి.సురేష్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, పి.కిషోర్‌లు తెలియజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇ.మునియ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా హైస్కూళ్ల హెచ్ఎంలు ఎస్‌కే మహబూబ్ బాషా, ఎండీ సుభానీ, సీహెచ్ రామకోటేశ్వరరావు, కె.అరుణ కుమారి, ఎస్ఎంసీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన షిర్డీ సాయిబాబా వార్షికోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో 80వ జయంతి వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారికి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కాకడ హారతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సబ్ పోస్ట్‌మాస్టర్ రాచపూడి చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన, ఆర్యవైశ్య కల్యాణ మండప కార్యదర్శి అన్నవరపు వెంకట సుబ్బారావు పతాకావిష్కరణ గావించారు. పూజా కార్యక్రమాల్లో కొమ్మినేని నాగభూషణం, ధనలక్ష్మి, బుర్లె విజయకుమార్, రోజారాణి దంపతులు పాల్గొన్నారు. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం అధ్యక్షురాలు బుర్లె అరుణకుమారి ఆధ్వర్యంలో గీతా పారాయణం జరిగింది. షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రలోని కొన్ని అంశాలు, స్తోత్ర మంజరి, స్తవన మంజరి, స్తుతులు, గేయాలను హేమవిఠలేశ్వర స్వామి దేవస్థాన కమిటీ మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి పల్లకి, ఊయల, పవళింపు సేవలు, శేజ్ హారతి నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, కోశాధికారి బుర్లె కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.



గీతా పారాయణంలో సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం నిర్వాహకులు

భట్టిప్రోలు హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంఈవో దేవరాజు

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సైన్స్ మండల నోడల్ ఆఫీసర్ అంబటి జాకబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో నీలం దేవరాజు ప్రారంభించారు. సైన్స్ ప్రాజెక్టుల వల్ల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఎగ్జిబిషన్‌కు మండలంలోని 7 హైస్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వ్యక్తిగత విభాగంలో వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి సురేష్ ప్రదర్శించిన సాల్విన్ రోబో, గ్రూప్ విభాగంలో టీఎంరావు హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సమ్ ఆఫ్ ఇంటర్నల్ యాంగిల్స్, ఉపాధ్యాయ విభాగంలో వెల్లటూరు హైస్కూల్‌కు చెందిన గుర్రం మురళీమోహన్, సుధాకర్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ప్రాజెక్టులు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు నోడల్ ఆఫీసర్ జాకబ్ తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవి రామకిషోర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.